1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

బడిబాటతో బడి బయట పిల్లలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడిబాటతో బడిబయట పిల్లలు లేకుండా చూడాలని జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయట పిల్లలు లేకుండా చూసే ఉద్దేశంతో బడిబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం కొత్తదనంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వేలో వాస్తవాలు నమోదు చేయాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మిషన్ భగీరథ ఇంటింటా సల్లాల పథకం అమలు తీరుపై చేపట్టిన సర్వేలో పంచాయతీ కార్యదర్శులు వాస్తవాలను నమోదు చేయాలని ఎంపీఓ గౌరీశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కోసిని, గువ్వలగూడ, రాస్పెల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వే తీరును పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం అమలు తీరు ఏవిధంగా ఉందనే విషయంలో నిక్కచ్చిగా వివరాలు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీ, సలీం పాల్గొన్నారు.



నిబంధనలకు పాతర..!

- ప్రయివేటు విద్యా సంస్థల్లో అమలుకాని ఉచిత విద్య
- విద్యాహక్కు చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న వ్యవహారం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

జిల్లాలోని కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సైతం పట్టించుకోవడం లేదు. అడిగే వారు లేరనే కారణంగా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. 2010 విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రతి ప్రయివేటు పాఠశాలలో 25శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. సామాజిక సేవా దృక్పథం ఉన్న కొన్ని పాఠశాలలు మినహా..అనేక ప్రయివేటు పాఠశాలలు ఈ నిబంధనను గాలికొదిలేశాయి. చట్టాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూడాల్సిన అధికారులు ఈ పని తమది కాదన్నట్లుగా వ్యహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫలితంగా కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు తమకు ఎవరూ అడ్డుచెప్పరనే ఉద్దేశంతో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విద్యాహక్కు చట్టంలో కీలకమైన ఈ అంశాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం..అమలు చేయాల్సిన అధికారులు అలసత్వం వహించడం కారణంగా నిరుపేద విద్యార్థులకు ప్రయివేటులో చదివే అవకాశం లభించడం లేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ప్రయివేటు విద్యా సంస్థలు పెరిగిపోతున్నాయి. ఓ వైపు సర్కారు బడుల్లో సౌకర్యాల లేమితో కూనరిల్లుతుండగా.. ఇదే అదనుగా ప్రయివేటు పాఠశాలలు కోకొల్లలుగా పెరుగుతున్నాయి. ఇది వరకు జిల్లా కేంద్రాల వరకే పరిమితమైన ఈ పాఠశాలలు తాజాగా మండల కేంద్రాల్లోనూ నెలకొల్పుతున్నారు. ఇందులో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు సామాజిక దృక్పథం కలిగి.. తక్కువ ఫీజులు తీసుకుంటూ.. విద్యార్థులకు మంచి విద్యనందించాలనే లక్ష్యంతో పనిచేస్తుండగా..అనేక పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఆయా పాఠశాలలకు అనుమతి తీసుకొనే సందర్భంలోనే నిరుపేద విద్యార్థులకు సేవలందిస్తామని బైలాస్‌లో తదితర కారణాలు చూపుతూ పాఠశాల స్థాపన కోసం అనుమతి తీసుకుంటారు. తీరా అనుమతులు వచ్చి పాఠశాల ప్రారంభం కాగానే వాటికి తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇష్టారీతిన ఫీజులు పెంచడం.. అనుమతి కోసం అందజేసిన దరఖాస్తు ప్రకారం సౌకర్యాలు కల్పించకపోవడం వంటివి చేస్తుంటారు. ఎవరూ అడిగే సాహసం చేయకపోవడంతో ఏండ్లుగా వారికి నచ్చిన నిబంధనలే అమలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అటు ప్రభుత్వం ..ఇటు అధికారులు వాటిపై దృష్టిసారించకపోవడంతో వారికి అడ్డుఅదుపు లేకుండా పోతోందనే వాదన వినిపిస్తోంది.



ఉచిత విద్యకు దూరం..!

ప్రతి ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకోవాల్సి ఉంటుంది. ఫీజుల వివరాలతో పాటు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం తదితర అన్నింటినీ ప్రభుత్వ నిబంధనల మేరకు పాటించాలి. కానీ కొన్ని విద్యా సంస్థలు వాటిని ఖాతరు చేయడం లేదు. మరోపక్క 2010లో ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రయివేటు పాఠశాల మొత్తం విద్యార్థుల్లో 25శాతం మంది పిల్లలకు కచ్చితంగా ఉచిత విద్యనందించాలనే నిబంధన ఉంది. కానీ ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. ప్రతి విద్యార్థి నుంచి ఫీజు వసూలు చేయడమే కాకుండా.. వారు నిర్ణయించిన మేరకు చెల్లించాల్సిందే. లేదంటే విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తుంటారు. ఏండ్లుగా ఈ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రయివేటు పాఠశాలలు ఈ నిబంధనను విస్మరిస్తున్నాయని తెలిసినా..మామూలుగా తీసుకుంటూ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కనీసం ఉన్నతాధికారులు సైతం ఇలాంటి నిబంధనలపై దృష్టిసారించడం లేదనే అభిప్రాయం ఉంది. ఈ నిబంధన అమలు చేస్తే కనీసం కొంతమంది నిరుపేద విద్యార్థులైన ప్రయివేటులో చదువుకొనేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి యూనియన్లను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆసిఫాబాద్ డిపోలో ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ జెండాని డిపో అధ్యక్షులు అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి టి. దివాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలు, త్యాగాలు చేసిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. దశాబ్ది కాలంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం గుర్తించలేదని అన్నారు. ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ ఇస్తానని హామీ ఇచ్చారని, కానీ అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్మెంట్ డేను వెంటనే ప్రకటించాలని కోరారు. 2013 బాండ్ల డబ్బులను ఉద్యోగులందరికీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను, పిఆర్సిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన సిసిఎస్ డబ్బులను వెంటనే మంజూరు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాల, పదవీ విరమణ పొందిన కార్మికులకు అందాల్సిన మొత్తాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మోహన్‌బాబు, కార్మికులు ఇజాజ్, మధుసూదన్, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మర్రి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎ.సరితతో కలిసి సందర్శించారు. గ్రంథాలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రూర్బన్ పథకంలో భాగంగా నిర్మించడం జరిగిందని, ఇందులో కావలసిన అదనపు పనుల కొరకు ప్రతిపాదనలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్‌తో పాటు కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఈడబ్ల్యుఐడిసి ఇంజనీర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చింతలమానేపల్లి

తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు సందర్శించారు. కొంతకాలం ఈ కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగించారు. అద్దె కట్టలేక అక్కడి నుండి పాఠశాల భవనంలోకి మార్చారు. ఇక్కడ సరైన వసతులు లేక ఇరుకు గదులలో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. భవనానికి సరైన దారి కూడా లేదు. కార్యాలయానికి వెళ్లడానికి ప్రజలు అతి కష్టం మీద వెళ్తూ జారి పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ భూమి చూపించినట్లయితే అన్ని భవనాలను ఒకేచోట నిర్మిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు త్వరలో భూమి గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు ఎల్కులె మల్లయ్య, ధోని శ్రీశైలం, తుకారాం, సుధాకర్, రమేష్, పురుషోత్తంచారి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టి డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరుచాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని తెలిపారు. వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులను అరికట్టడంతో



పాటు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో నిత్యం అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతిరోజూ జ్వరాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. జ్వరం కేసులు వచ్చినట్లయితే ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆర్బీఎస్కె బృందాలు జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలను నిరంతరం సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రసూతి మరణాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారాంభట్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళి

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

- ముక్తకంఠంతో నినదించిన మండల వాసులు
- పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి
- మండలంలో కొవ్వొత్తులతో ర్యాలీ

నవతెలంగాణ-దహెగాం

అయ్యో పాపం చిన్నపిల్ల..ఇంత చిన్నపిల్లను పాడు చేసి పొట్టన పెట్టుకున్న మానవ మృగాన్ని వెంటనే నడి బజార్లో ఉరి తీయాలి..అంటూ మండల వాసులు ముక్తకంఠంతో నినదించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జరిగిన ఈ సంఘటన యావత్తు రాష్ట్రాన్ని కదిలించింది. మండల కేంద్రానికి చెందిన ఎల్కరి మహేష్-సాహితీ దంపతులకు ఇద్దరు కూతుళ్లు సహస్ర(6), మేఘన(7నెలలు) ఉన్నారు. సొంత గ్రామంలో ఉపాధి లేక వీరి కుటుంబం బతుకు దెరువు కోసం కొన్ని సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సమీపంలోని రైస్‌మిల్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటోంది. గురువారం రాత్రి భార్యాపిల్లలతో నిద్రిస్తున్న క్రమంలో ఇదే రైస్ మిల్‌లో పనిచేస్తూ పక్కనే ఉంటున్న వేరే రాష్ట్రానికి చెందిన మహేష్ పెద్ద కూతురు సహస్రను ఎత్తుకుపోయి లైంగిక దాడి చేశాడు. అనంతరం హత్య చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మండలానికి చెందిన ఆరెకుల సంఘం నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు చిన్నారిని చిదిమేసిన మృగాన్ని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం రాత్రి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేత

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని ఆరేగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అందులోనూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలకు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కావని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని తెలిపారు. అనంతరం పిల్లలకు టెక్స్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేసి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్, మానస, ఉపాధ్యాయులు స్వరూప, అనూష, సంధ్య, రమేష్, రాజేష్, ఎంపీటీసీ శోభ, సీఏ లావణ్య, మాజీ ఎంపీటీసీ అంబనగంటి సాంబయ్య, చాప్లె రాందాస్, భీమన్‌కార్ బాబురావు, గణపతి పాల్గొన్నారు.

లబ్దిదారులకు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 114 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆడపడుచులకు రూ.1,00,116పాటు, తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదని తెలిపారు. కేవలం, రూ.1,00,116 ఇచ్చి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ఈ విషయంపై రాబోయే అసెంబ్లీ సమావేశాలలో లేవనెత్తుతామని తెలిపారు. పోడు భూముల సమస్య చాలా తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.





కౌటాల : మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే హరీష్‌బాబు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా రూ.లక్ష ఒకవంద పదహారుతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బసార్కర్ విశ్వనాథ్, రవీందర్ నాయక్, ఎంపిటిసి దుర్గం మోతిరాం, బసార్కర్ శిరీష పాల్గొన్నారు.

కస్తూరిబాగాంధీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఈ సంవత్సరం ఇంటర్ ప్రవేశానికి మండలంలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి రేఖ తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు, సీఈసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరు నుండి పదో తరగతి వరకు ఖాళీగా లేవని పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యూనిఫామ్‌లు, పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఎంఈఓ మణుకుమార్ పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధర్మాబాయి, ఐకేపీ ఏపీఎం మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

సర్కారు బడి ముద్దు.. ప్రయివేటు వద్దు..

- టీపీజీఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిప్రి గ్రామంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీజీఎస్ జిల్లా అధ్యక్షులు ఊయిక విష్ణు మాట్లాడుతూ సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్‌లు, ఏకరూప దుస్తులను అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సూర్య, పటేల్ విజయ్ పాల్గొన్నారు.



ఎంపీపీఎస్‌లో సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఘన్‌పూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు చేయించారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఎంపీపీ, ఉపాధ్యాయులు కలిసి సరస్వతీదేవి పూజలు నిర్వహించి, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు చేతులు పట్టి అక్షరాలు రాయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వీఓ లీడర్లు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా సాధికారతపై అవగాహన



నవతెలంగాణ-ముధోల్

మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ముద్గల్ గ్రామపంచాయతీలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మిషన్ శక్తి, జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక మాట్లాడుతూ బాల్యవివాహాలు, నిర్మూలన, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 గురించి అవగాహన కల్పించారు. అలాగే మహిళా సాధికారత గురించి, సఖి చైల్డ్ సర్వీసెస్, మహిళా హక్కులు, లింగ వివక్షత, లింగ సమానత్వం మహిళా హెల్ప్‌లైన్ నెంబర్స్ గురించి గ్రామ మహిళలు గర్భిణులకు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాల గురించి హెల్ప్ లైన్ నెంబర్ 1930 గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలవోద్దిన్, కారోబారి గణపతి, వీఓఏ ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ఆశా వర్కర్ ప్రేమలత అంగన్‌వాడీ టీచర్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పొన్న గంగారెడ్డి సోదరి ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు శుక్రవారం గంగారెడ్డిని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యకర్తల కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాక్నూర్ రాములు, కొప్పుల బుచ్చన్న, ఉప్పు పోశెట్టి, అయిటి రమేష్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటికి మిషన్ భగీరథ సర్వే

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) శాంతినగర్‌లో ఇంటింటికీ మిషన్ భగీరథ సర్వే చేట్టారు. శుక్రవారం కాలనీవాసులు ప్రతిరోజు మిషన్ భగీరథ నీరు వస్తుందని తెలిపారు. నల్ల ఉండి నీరురాని వారి పేర్లను నమోదు చేసుకున్నారు. త్వరలో ప్రతి ఇంటికి తాగునీరు వచ్చేటట్టు చర్యలు తీసుకుంటామని ఎంపీఓ తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, చవాన్ ప్రకాష్, మధు, మల్టీ పర్పస్ వర్కర్స్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని వర్ధమన్నూర్ గ్రామానికి చెందిన ఈదుల లింగన్న ఇల్లు రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తన ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇంటిలోని నిత్యావసర వస్తువులతో పాటు బట్టలు కాలి బూడిదయ్యాయని, లబోదిబోమన్నాడు. ప్రభుత్వం ఆదుకొని తనకు నష్టపరిహారం అందించాలని కోరారు.

ప్రభుత్వం బాధితునికి నష్టపరిహారం అందించాలి...

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా కాలడంతో భారీగా నష్టపోయిన బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ స్టేట్ ఈసీ మెంబర్ మెస్రం జంగుబాపు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తనకు తోచిన పరిహారాన్ని లింగన్నకు అందించారు. ఈ కార్యక్రమంలో మెస్రం రాజు, నవనీత్, అశోక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని హతమార్చిన దండుగులను శిక్షించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 12న గిరిజన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్‌ను లోకారి అర్జుని మధ్య కెనాల్ వద్ద హతమార్చిన దండుగులను కఠిన శిక్షించాలని నాగల్‌కొండ గ్రామస్తులు డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐ రహీమ్ పాషాకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అమృత్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, వెంటనే నిందితులను శిక్షంచాలని అన్నారు. మృతుడు గజేందర్ పేరు మీద ఉన్న ఆస్తిని భార్య పేరు మీద కాకుండా తన కొడుకు పేరు మీద చేయాలని మృతుని తల్లి దండ్రులు జాదవ్ భిక్కు సీఐని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు రాథోడ్ జాలిందర్, మాన్కాపూర్ మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, బంజారా యువ సేన మండల నాయకులు జాదవ్ దత్త, పేసా చట్టం మండల కోఆర్డినేటర్ సికిందర్, జాదవ్ అర్జున్, రాథోడ్ జితేందర్, జాదవ్ రమేష్, రాథోడ్ రోహిదాస్, జాదవ్ మోహన్, సారాజి, అజయ్, గణేష్ ఉన్నారు.

నిందితులను పట్టుకున్న పోలీసులు...

హత్య జరిగిన వెంటనే 24 గంటలలోపు డీఎస్పీ నాగేందర్ పర్యవేక్షణలో సీఐ రహీమ్ పాషా పోలీసులు రంగంలో దిగి భార్యను నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారితో విచారించి పూర్తి వివరాలు సేకరిస్తామని సీఐ తెలిపారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్య

నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆశ్రమ ఉన్నత పాఠశాల నర్సపూర్(బి), శాటిలైట్ సెంటర్ సాలెగూడ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా రిపేర్స్ ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనదారుడిపై రోడ్డు సిబ్బంది జులుం

- గాయాలపాలైన వాహనదారుడు నుంచి డబ్బులు డిమాండ్
- తల్లి అస్థికలు తీసుకెళ్తున్నానని ప్రాధేయపడ్డా వదలని సిబ్బంది



నవతెలంగాణ-ముధోల్

రోడ్డు సిబ్బంది నిర్లక్ష్యంతో గాయాలపాలైన ద్విచక్ర వాహనదారుడు నుంచి రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది డబ్బులు డిమాండ్ చేయటం చర్చకు దారి తీసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కుబీర్ మండలంలోని పల్సి తాండకు చెందిన ప్రమోద్ కుమార్ తన ద్విచక్ర వాహనంపై తల్లి అస్థికలు తీసుకొని శుక్రవారం బాసర గోదావరికి వెళ్తున్నాడు. అయితే ముధోల్ కంటి దవఖాన సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులు చేస్తున్న ఓ కంపెనీ సిబ్బంది ద్విచక్ర వాహనం నడిరోడ్డుపై ఉండటంతో రెండు ద్విచక్ర వాహనలు డీ కోన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ప్రమోద్ కుమార్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది వెంటనే గాయాల పాలైన ప్రమోద్ కుమార్ ద్విచక్ర వాహన తాళం చేయి తీసుకొని డబ్బులు డిమాండ్ చేశారు. వదిలిపెట్టండని ప్రాధేయపడ్డ రోడ్డు సిబ్బంది కనకరించలేదు. తన తల్లి అస్థికలు తీసుకొని బాసరకు వెళుతున్నానని ఎంత మొరపెట్టుకున్న వారు వినిపించుకోలేదు. కనీసం ఆస్పత్రికి తీసుకెళ్దాం అన్న మానవత్వం కూడా మర్చిపోయారు. దీంతో అటువైపు వెళ్తున్న స్థానిక విలేకరులు వెంటనే కంపెనీ సిబ్బందితో మాట్లాడి తాళం చెవి ఇవ్వాలని చెప్పారు. అయిన వారు డబ్బులు ఇచ్చేదాకా ఇవ్వమని మొండికేశారు. దీంతో విలేకరులు ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో చేసేదేమీ లేక రోడ్డు పనులు చేసిన కంపెనీ సిబ్బంది తాళం చెవి ఇచ్చారు. రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ కంపెనీ సూచిక బోర్డులు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న రోడ్డు సిబ్బంది మాత్రం ద్విచక్ర వాహనదారుడు నుంచి డబ్బులు డిమాండ్ చేయటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై మోహన్‌రావు పరిశీలించారు. రోడ్డు సిబ్బందిని మందలించారు. గాయలపాలైన బాధితుడు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడు తన తల్లి ఆస్థికలను బాసర గోదావరికి తీసుకెళ్లాడు.

ఎట్టకేలకు బాధిత రైతులకు నగదు అందజేత

- హర్షం వ్యక్తం చేసిన రైతులు
- కలెక్టర్, ఎమ్మెల్యేకు రైతుల సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి విక్రయించిన రైతుల ఖాతాల్లో నుంచి డబ్బులను పోస్టల్ బ్యాంక్ మేనేజర్ కాజేసిన విషయం తెలిసిందే. అయితే ఆ విషయంలో కొంతకాలంగా విచారణ చేపట్టిన అధికారులు బాధిత రైతులకు డబ్బులను తిరిగి ఎట్టకేలకు చెల్లించారు. శుక్రవారం తపాల కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి డబ్బులు ఇవ్వగా, కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. తక్కువ కాలంలో రూ.కోటి 15 లక్షల డబ్బులను తిరిగి చెల్లించేలా సహకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్లను రైతులు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మూడు నెలల క్రితం సీసీఐ ద్వారా పత్తి విక్రయించిన రైతుల డబ్బులను పోస్టల్ బ్యాంక్ అధికారి కాజేశారన్నారు. ఇదే విషయం రైతులు పోలీసులు, అధికారులకు తెలిజేయడంతో స్పందించి కేసు నమోదు చేసి డబ్బులు మాయం చేసిన వ్యక్తిని కూడా పట్టుకున్నారన్నారు. అదే విధంగా పోస్టల్ బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులకు డబ్బులు వచ్చేలా కృషి చేశామని తెలిపారు. ఇందులో ఎమ్మెల్యేతో పాటు పోస్టఫీసు సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు. రైతులు కూడా విచారణలో కావాల్సిన సమాచారం ఇవ్వడంతో తక్కువ కాలంలో డబ్బులను ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఎలాంటి భయందోళనలకు గురికావద్దన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఎడైన స్కాం జరిగితే న్యాయ విచారణ జరిగి డబ్బులు రావాలంటే సంవత్సరాలు గడుస్తాయని అన్నారు. కలెక్టర్ చొరవతో రైతులకు మూడు నెలల కాలంలో డబ్బులు రావడం సంతోషకరమైన విషయమన్నారు. రైతుల కోసం గతంలో శాంతి కుమారి, ఇప్పుడు రాజర్షిషా పని చేయడం హర్షనీయమన్నారు. ప్రస్తుతం ప్రతిది ఆన్‌లైన్ అయిందని, రైతులు బ్యాంకులు వెళ్లే సమయంలో వారి వెంట వీటి గురించి తెలిసిన వారిని తీసుకెళ్లాలని సూచించారు.

మాంగ్ సమాజాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాంగ్ సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పిట్టలవాడలో రూ.20 లక్షలతో నిర్మించనున్న మాంగ్ కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ముందుగా అంబేద్కర్, అన్నబావుసాఠే, లాహూజీ సాల్వే చిత్రపటాలకు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ సభ్యులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాంగ్ సమాజాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఆర్థింగా బలపడేలా బ్యాంకుల ద్వారా ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలను ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నుంచి ఐదు కోట్ల వరకు రుణాలు అందిస్తుందని, అలాంటి ఎవరైన ముందుకు వస్తే తన సహకారం ఉంటుందన్నారు. మాంగ్ సమాజ్ సభ్యులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని కోరారు. మాజీ డీసీసీబీ చైర్మెన్ దివంగత కాంబ్లే నాందేవ్ కూడా మాంగ్ సమాజ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన కృషి ఫలిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో డీసీసీబీ చైర్మెన్‌గా ఉన్న దివంగత కాంబ్లే నాందేవ్ మాంగ్ సమాజ కమ్యూనిటీ హాల్ కోసం ఎమ్మెల్యే జోగు రామన్నకు విన్నవించారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. పిట్టలవాడలో సమాజం కోసం 16 గుంటల భూమిని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. పనులు త్వరగా పూర్తి అయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్ చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రఘుపతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, అధినాథ్, మాంగ్ సమాజ్ అన్నబావుసాఠే అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

బ్రిడ్జి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో రాజుర గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఉన్న సైడ్ డ్రైన్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో పూర్తిగా నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాలు మొదలవుతున్న నేపథ్యంలో బ్రిడ్జికి వెళ్లడానికి ముందు మొరం రోడ్డు వేసుకోవాలని తర్వాత రైతులను ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. వీరి వెంట ఎంపీపీ సజన్, వీడీసీ రవీందర్, గులాబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తుగా మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 25 మంది విద్యార్థినులకు పరీక్షించి దగ్గు, జ్వరం, జలుబు ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహన్ నెహ్రు, పాఠశాల సిబ్బంది విశ్వనాథ్, శివాజీ, హరిచంద్, వైద్య సిబ్బంది సింధు, భోజ్జు బాయి, కవిత కుమారి ఉన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుప్టి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను నీరు పోసి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల నాయకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శివారెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీటీసీ చంద్రశేఖర్, వీడీసీ చైర్మెన్ మందుల రమేష్, నేరడిగొండ వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాదరక్షలు వదిలిన కంది అభిమాని

నవతెలంగాణ-జైనథ్



ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో అడుగు పెట్టేంత వరకు పాదరక్షలు ధరించనని కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు పిడుగు స్వామి యాదవ్ ప్రతిన బూనారు. శుక్రవారం తన ఇష్టదైవమైన జైనథ్ శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో తన అభిమాన నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టేంత వరకు పాదరక్షలు ధరించనని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఈ రోజు 77వేల ఓటు బ్యాంకు సంపాదించిన ఘనత కంది శ్రీనివాసరెడ్డిదని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో అసెంబ్లీలో అడుగు పెడతారని అప్పటివరకు పాదరక్షలు వేసుకొనని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు డీఈ శివప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని భీంపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఈనెల 20లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పాఠశాలలో సకల సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేసిందని గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఏఈ రాథోడ్ సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధకృష్ణ ఉన్నారు.

ఎన్నాల నగేష్‌కు అభినందనల వెల్లువ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్ ఎన్నికయ్యారు. కాగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఆయనను సత్కరించి పుష్పగుచ్చాలు అందిస్తు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్నాల నగేష్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. మూడు సార్లు ఆదిలాబాద్ బార్ అధ్యక్షుడిగా గెలిపించడంతోనే హైకోర్టులో ఆదిలాబాద్ పేరు వినిపించిందన్నారు. దానికి కారణంగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తనకు పదవీ ఇచ్చిందని, ఇది న్యాయవాదుల కృషి వల్లనే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉన్నారు.

నజ్రూల్‌నగర్‌లో విద్యుత్ అదాలత్

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని నజ్రూల్‌నగర్‌లో శుక్రవారం విద్యుత్ అదాలత్(విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించారు. డీఈఈ నాగరాజు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదాలత్‌లో మొత్తం 25 అర్జీలు రాగా 21అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించారు. మిగతావి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారుల పాత విద్యుత్ బకాయిలు రూ.50వేలు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఈశ్వర్, ఏఏఈ తుకారాం, ఏడీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నీట్, ఐఐటీ ర్యాంకర్లకు సన్మానం

చింతలమానేపల్లి : నీట్, ఐఐటీలో సత్తా చాటిన బాబాసాగర్ గ్రామానికి చెందిన సుమన్ సన్యాల్, రవీంద్రనగర్-1 గ్రామానికి చెందిన రిషిత మండల్, లంబాడిహెట్టి గ్రామానికి చెందిన అజ్మీరా శైలజ, ఐఐటీలో సత్తా చాటిన బానోత్ తరుణ్‌ను శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల పల్లెల నుండి అత్యున్నత స్థానాలకు ఎదుగుతున్న విద్యార్థులు సొంత గ్రామాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీ, ఎంపీడీవో కోట ప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నజీమ్ హుస్సేన్, దోని శ్రీశైలం, సుధాకర్, మనోజీత్ మండల్, సుశీల్ మండల్, పవన్, మోహన్, తుకారాం, పురుషోత్తంచారి పాల్గొన్నారు.



మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే • మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్‌డీఓ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టిపై అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. వ్యాపారం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఔత్సాహిక మహిళా సంఘాలు చేపల పెంపకం వైపు దృష్టి సారించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సౌకర్యం ఉన్న చోట మత్స్యకారుల గ్రూపులు, ఎస్సీ, ఎస్టీ సంఘాలను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. చేపల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటునివ్వాలని సూచించారు. బ్యాంకు లింకేజీలు వందశాతం పూర్తవ్వాలని, స్త్రీనిధి రుణాలను వందశాతం సాధించాలని తెలిపారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పనితీరును మెరుగుపరుచుకోవాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. కమ్యూనిటీ కో ఆర్డినేటర్ల పనితీరుపై నివేదికలు అందజేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హనుమంతు, స్త్రీ శక్తి మేనేజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

లక్కీడీప్ ద్వారా బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో జిల్లాకు సంబంధించిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా విద్య ఒక్కటే ఆయుధమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గుణాత్మక విద్యను అందించడం కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వెనుకబడిన వర్గాలకు విద్యను అందిస్తుందన్నారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్కీ డీప్ ద్వారా మొత్తం 33 మందిని ఎంపిక చేశామని, అందులో ఆదిమ గిరిజనులకు మూడు, ఏజెన్సీ గిరిజనులకు మూడు, సాధారణ గిరిజనులకు 27సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ఏటీడీఓ క్షేత్రయ్య పాల్గొన్నారు.

19 ఏండ్లలోపు వారికి ఆల్బెండోజోల్ మాత్రలు వేయించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు 1-19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండోజోల్ మాత్రలు వేయించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు, విద్యార్థులకు ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండోజోల్ వేయించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 20న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 1-19 వయస్సు గల చిన్నారులు, విద్యార్థులు 2లక్షల 21వేల 141 మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్‌లలో, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 20న వేసుకోని వారికి 27న కచ్చితంగా మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భాద్యతగా ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలందరికీ వేయించాలని సూచించారు. మాత్రల పంపిణీపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఎంహెచ్‌ఓ డా.నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఉన్నారు.

చిరుత దాడిలో మేక పిల్లకు గాయాలు



నవతెలంగాణ-తలమడుగు

చిరుత దాడిలో మేకపిల్లకు గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మేకలకాపరి ముత్యాల ఆశన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణకు చెందిన మేకపిల్లను మేకలకాపరి కొత్తూరు చెరువు సమీపంలో మేపుతుండగా మేకపిల్లపై చిరుతదాడి చేసింది. కమ్మరి సత్యనారాయణ తన మేకలను కొత్తూరు గ్రామానికి చెందిన ముత్యాల ఆశన్న మేకల మందలో ఉంచగా ఎప్పటిలాగా మేకల కాపరి ఆశన్న శుక్రవారం ఉదయం కొత్తూరు చెరువు సమీపంలో మేకలు మేపుతుండగా చిరుతపులి మంద నుంచి మేకను ఎత్తుకెళ్లగా చూసిన మేకలకాపరి తన దగ్గర ఉన్న గొడ్డలతో చూచు అంటూ చిరుతపులి వద్దకు వెళ్లగా చిరుత మేకను విడిచిపెట్టి పరారైనట్టు తెలిపారు. మేక యాజమాని కమ్మరి సత్యనారాయణకు సమాచారం అందించగా, మేకను తన ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు తెలిపారు. దీంతో మేకల కాపారులు భయాందోళనలకు గురై ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఖరీఫ్ పంటలు కూడా మొదలవడంతో పత్తి విత్తనాలు నాటడంలో రైతులు తమ చేను పనులకు వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న కొత్తూరు, తలమడుగు, కుచులాపూర్ గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలను తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాల వారీగా ధరణి దరఖాస్తులు, ఇప్పటివరకు పూర్తి అయినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలాల వారీగా వచ్చిన ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు తదితర అంశాలను కలెక్టర్ ప్రధాన కార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డిలు, కలెక్టరేట్ ఏఓ సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి స్నానానికి వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ-లోకేశ్వరం

గోదావరి స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పంచగుడి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంచగుడి గ్రామానికి చెందిన రాపతి భోజయ్య(28) గురువారం సాయంత్రం 5 గంటలకు స్నేహితులతో కలిసి గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. మృతుడు రాపతి భోజయ్య గోదావరి నదిలో స్నానం చేస్తుండగా, నీటి లోతు ఎక్కువగా ఉండటంతో మునిగి చనిపోయాడు. శుక్రవారం మృతదేహాన్ని జాలరులు బయటకు తీశారు. మృతుని భార్య రాపతి హరిత ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రక్తం యంత్రం ద్వారా తయారు చేసేది కాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రక్తం యంత్రం ద్వారా తయారు చేసేది కాదని మానవ శరీరం నుంచి సేకరించాలని, ప్రమాదాల సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్‌లో రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రిమ్స్‌కు చెందిన చిన్నపిల్లల నిపుణులు డాక్టర్ తిరుమల్‌రెడ్డి మొదట రక్తదానం చేయగా, ఆయనకు పండ్ల రసం అందించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ గిరిజన జిల్లా కావడంతో రక్తం చాలా అవసరమవుతుందన్నారు. జిల్లాలో అనేక మంది రక్తహీనత, తలసేమియాతో బాధ పడుతున్నారని అన్నారు. రక్తదానంపై యువతలో అనేక అపోహలున్నాయని, వాటిని తొలగించడానికి ప్రతి ఏటా ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఇతర ఆర్గనైజేషన్‌లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ప్రమాదాలు జరగకుండా ఇనుప కంచె ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని బస్‌స్టాప్‌కు ఎదురుగా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు, గ్రామ యూత్ సభ్యులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం యూత్ సభ్యులు మీడియాతో మాట్లాడారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. మండల కేంద్రంలో ఎన్‌హెచ్ 44 రహదారి ఊరుకు మధ్యలో నుంచి వెళ్లడం వల్ల ఈ ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి అడ్డాగా చెప్పుకోవచ్చన్నారు. హైవేపై దేశ నలుమూలల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తాయని అన్నారు. హైవేపై వాహనాలు అతివేగంగా రావడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించారు. కనీసం రోడ్డుకి ఇరువైపులా ఇనుపకంచే ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఈ ప్రమాదాలపై తరుచూ పత్రిల్లో వస్తున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఇనుప కంచె ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో సాముహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభోత్సవం సందర్భంగా నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు, రాజేశ్వర్, ప్రవీణ్, ముత్యం, యశ్వంత్ రావ్, నరేష్, ఎంపీటీసీ ఒరికే నర్సవ్వ పోతన్న, వీడీసీ చైర్మెన్ దాసరి ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలానికి చెందిన పలువురు బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి, అభినందనలు తెలిపారు. ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. ఇందులో సుష్మలత, సరస్వతి, అనసూయ, కమల ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కైలాస్ నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 వరకు శాంతినగర్, కుమ్మరివాడ, వాల్మీకినగర్, అటెండర్స్ కాలనీ, రవీంద్రనగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, పాలిటెక్నిక్ కాలేజ్, ఇండస్ట్రియల్ ఏరియా, ఆర్ఆర్ నగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాళీలను జాబితాలో ఉంచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ పదోన్నతులలో అన్ని ఖాళీలను జాబితాలో పొందుపర్చాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చౌహన్, గోపికృష్ణ అన్నారు. శుక్రవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పదోన్నతులు బదిలీల్లో గవర్నమెంట్ లోకల్ బాడీ, మేనేజ్మెంట్ పాఠశాలలో అప్‌గ్రేడ్ అయిన ఎల్పీ అండ్ పీఈటీ అన్ని ఖాళీలను వేక్ కౌన్సిలింగ్‌లో వెబ్ కౌన్సెలింగ్‌లో చూపాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం పిల్లలను చేర్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం పిల్లలను చేర్పించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా లెవల్ కన్వర్జెన్సీ సమావేశంలో లైన్ డిపార్ట్ మెంట్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారిగా లక్ష్యాలను సాధించేందుకు ఎంఈఓలు బాధ్యత తీసుకొని పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని, గతం కంటే ఈ ఏడాది ఎక్కువ అడ్మిషన్లు జరగాలని ఆదేశించారు. అడ్మిషన్ల కొరకు మండలాల్లో సమావేశాలు నిర్వహించుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రైమరీ స్కూల్‌లో చేర్పించాలని అన్నారు. బడీడు పిల్లలను గుర్తించి, స్కూల్లో చేర్పించాలని ఆదేశించారు. మండలాల వారిగా ఇప్పటి వరకు నమోదైన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఈఓ ప్రణీత, అధికారులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలం యాపల్‌గూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే విద్యార్థుల కొరకు పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. గతంలో కూడ తను మంత్రిగా నియమితులైనప్పుడు మొట్టమొదటి కార్యక్రమం బజార్‌హత్నూర్ మండలంలోని ఓ పాఠశాలలో భూమిపూజ చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. అనంతరం యాపల్‌గూడ గ్రామస్తులు ఎంపీ నగేష్‌ని, ఎమ్మెల్యే పాయల శంకర్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేష్, బీజేపీ మండల అధ్యక్షులు సంతోష్, దత్తు, విజయ్, ఆదినాథ్, లింగు పాటిల్, గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాతలకు ఘన సన్మానం



నవతెలంగాణ-నిర్మల్

అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వర్గీయ కావేటి పోతమ్మ చారిటబుల్ ట్రస్టు, నిర్మల్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు ఎక్కువసార్లు రక్తం దానం చేసిన రక్తదాతలకు ఘనంగా సన్మానం చేశారు. ఇప్పటివరకు 91సార్లు రక్తదానం చేసిన గంగిశెట్టి ప్రవీణ్, 70 సార్లు రక్తదానం చేసిన యాటకారి సాయన్నకి మెమోంటో, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధుసూధన్ మాట్లాడారు. రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. సన్మాన గ్రహీతల సేవా తత్పరతను కొనియాడారు. అనంతరం ఇటీవల రాష్ట్ర స్థాయిలో నృత్య పోటీలలో రవీంద్రభారతిలో ప్రథమ బహుమతి సాధించిన అక్షిత అనే విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయిడి రమేష్, శ్రీరాముల శ్రీనివాస్, సాధం ఆనంద్, రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, ఉపాధ్యాయులు అత్తరొద్దిన్, నారాయణ, విశ్వనాథవర్మ, శ్రీనివాసచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ జయశీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాలు అయి ఉండాలి. ఆదిలాబాద్ గ్రామీణ, పట్టణ, మావల మండలం నుంచి అప్లై చేసుకునే వారు తేది 17 నుంచి 20 వరకు అప్లికేషన్ ఫారమ్‌లను ఎంఈఓ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

పోలీస్ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని ఎల్లపెల్లి గ్రామం సమీపంలో సర్వే నెంబర్ 459 లోని స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ డా. జి.జానకి షర్మిల శుక్రవారం పరిశీలించారు. అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, తహసీల్దార్ రాజు, సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



పట్టణంలోని బాలభారతి పాఠశాలలో ఇండియన్ మోక్షిత డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా అంగన్‌వాడీ టీచర్ మాచర్ల వినోద వ్యవహరించారు. విజేతలను ఈ నెల 18న శిక్షణ ముగింపు రోజు ఎంపిక చేసి బహుమతులు అందజేయడం జరుగుతుందని ఇండియన్ మోక్షిత డ్యాన్స్ అకాడమీ మాస్టర్ డోంగ్రి సంతోష్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ పాఠశాలలను బలవపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిర్రకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందని అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు, అనంతరం తుంపల్లి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఓరియంట్ కంపెనీ క్లబ్‌లో మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరుపున ఓరియంట్ కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఓరియంట్ కార్మికులు, గ్రామస్తులు, యువకులు తరలివచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. సాయంత్రం వరకు కొనసాగిన రక్తదాన శిబిరంలో సుమారు 500 మంది వరకు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, ఓరియంట్ మహిళా మండలి అధ్యక్షురాలు ప్రీతి జోషి, సీనియర్ జీఎం అరండ్ కులకర్ణి, రెడ్ క్రాస్ సొసైటీ సత్యపాల్‌రెడ్డి, శరత్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ పట్ల అనుచిత వాఖ్యలు చేయడం తగదు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పట్ల బీఆర్ఎస్ నాయకుడు కలెగూర రాజకుమార్ అనుచిత వాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ మండల నాయకులు హెచ్చరించారు. జోడువాగు పై వంతెన నిర్మాణం వివేక్ ఆపివేశారనడంలో నిజం లేదని అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పట్ల మాట్లాడుతున్నప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు వివేక్ వెంకటస్వామిని తప్పు పట్టడం అవివేకం, అహంకారమని అన్నారు. మునుముందు ఇలాంటి తప్పుడు మాట్లాడితే చదువుకున్న మూర్ఖుడిగా భావించాల్సివస్తుందని సంస్కారంతో వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తైనేని రవి, బూనేని సుధాకర్, అంగడి రాజ్యం, కోట రమేష్, ఆవిడపు రవితేజ, సందనవేణ అజయ్, నరేష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల రెండవ జాబితా విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన రెండవ ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి జాబితాలో మిగిలిన 13 సీట్లను భర్తీ చేయుటకు రెండవ జాబితా విడుదల చెసినట్లు, అదేవిధంగా 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 2 సీట్లకు, 8వ తరగతిలో ఖాళీ అయిన 3సీట్లకు కూడా ఎంపిక జాబితా విడుదల చేసినట్లు, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15, 18వ తేదీల్లో ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని, ఇచ్చిన గడువు లోపు హాజరు కాని విద్యార్థుల సీటు రద్దు చేయబడుతుందని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జీవన్ ధాన్ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 40 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కె రాజేశ్ మాట్లాడుతూ శిబిరంలో రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. దాతలకు ఒక సంవత్సరం బీమా పాలసీని చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు రఘు, శివ, రక్తదాతలు ఈర్ల సునీల్, శ్రీకాంత్, సాయి, ప్రవీణ్, గోరంట్ల సంతోశ్, అమ్మ శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న ఆశా వర్కర్లకే పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి తుకారాం బట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమకు పరీక్ష నిర్వహించవద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు గురువారం చేసిన నిరసనకు స్పందిస్తూ పేర్కొన్న ప్రకటనలో వివరణ ఇచ్చారు. సర్టిఫికేషన్ కోసం ఇప్పటికే 50 శాతం మంది దరఖాస్తు చేశారని వారికి మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్లు, పరీక్షపై ఆశ వర్కర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఎంపీని సన్మానించిన సిర్పూర్ నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నాగేష్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు శాలువాలు, పుష్ప గుచ్చాలతో సన్మానించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యక్రమ కోఆర్డినేటర్ గోలెం వెంకటేశం, బీజేపీ నాయకులు గజ్జల లక్ష్మణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్ కుమార్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి, నాయకులు బికాస్ ఘరామి పాల్గొన్నారు.

పర్మిట్లు ఇవ్వడంలో పాత విధానాన్ని అనుసరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కట్టె మిల్లుల నుంచి కొనుగోలు చేసే కర్రకు సంబంధించి పర్మిట్లు ఇవ్వడానికి నూతనంగా తీసుకువచ్చిన ఎలక్ట్రానిక్ విధానాన్ని రద్దుచేసి పాత విధానమైన ఆఫ్ లైన్ విధానాన్ని అమలు చేయాలని సామిల్ టింబర్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్ డిమాండ్ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కన ఉన్న మహారాష్ట్రలో పర్మిట్లు ఇవ్వడంలో ఆఫ్ లైన్ విధానం అమలులో ఉందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఆన్‌లైన్ విధానం అమలు చేయడం వల్ల పర్మిట్లు జారీ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో కోసిన కర్ర అమ్ముకోలేక అడ్వాన్సులు వాపస్ ఇవ్వాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు, అటవీశాఖ అధికారులు స్పందించి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు అఖిల్, రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గీత కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని కిష్టాపూర్ గ్రామపంచాయతీ రుమ్మిపూర్‌కు చెందిన బొంగోనీ రమేష్ గౌడ్ తాటి చెట్టు పైనుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు చెట్టును గీసేందుకు తాడిచెట్టు పైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన రమేష్ గౌడ్‌ను మంచిర్యాల పట్టణం మిడిల్ లైఫ్ ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారని ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని అన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లలకు కలిగే లాభాలపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలో విస్తృతమైన అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా విద్య, వైద్య, పంచాయతీ, శిశుసంక్షేమం, గ్రామీణ అభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలోని వందశాతం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని తెలిపారు. ఏదయినా కారణంచేత పిల్లలు ఈనెల 20న మాత్రలు తీసుకోనట్లయితే, జూన్ 27న అవకాశం ఉంటుందని తెలిపారు. నులిపురుగుల నివారణా మాత్రలను పిల్లలకు భోజనం చేసిన అనంతరమే అందించాలని, ఏవయినా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులకు తెలియపరచాలన్నారు. పిల్లలకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని, ఆరోగ్యంగా ఉంటేనే అందించాలని సూచించారు. పిల్లలెవరికీ మాత్రలు ఇంటివద్దకి ఇవ్వకూడదని చెప్పారు. చిన్నపిల్లలకి అందించే ముందు మాత్రలను పొడిరూపంలో అందించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా విద్యాశాఖ లైజన్ అధికారి ఉదయబాబు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అడిషనల్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాలలో మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్ సుడిగాలి పర్యటన చేశారు. శుక్రవారం ఆయన జన్నారం మండలంలోని రేండ్లగూడ, కిష్టాపూర్, ధర్మారం గ్రామాలలో పర్యటించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎస్.రమేష్ పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్

మండలంలోని ధర్మారం గ్రామ యూపీఎస్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్ పాల్గొన్నారు. ఆ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ విజయ్ కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొంగోరి గోపాల్ రామటెంకి శ్రీనివాస్ ఆ గ్రామ మాజీ సర్పంచ్ దుర్గం గంగాధర్, జాడి రాజలింగు దముగా కరుణాకర్ పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు ఆదర్శ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకారవేతనాలకు-(ఎన్ఎంఎంఎస్) నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 10వ తేదీన 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎంపిక పరిక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా యు కృష్ణవేణి, పల్లెర్ల వైష్ణవి, గుజ్జ శ్రీశాంత్, అలీజా షైజీన్, సాంగ్డే మీనాక్షి, ఎం రిషిత, బి మధుప్రియ, కె సాహిత్య, ఎన్ హరిచందన, మామిడి స్రవంతి, ఐ అక్షర, ఎం విష్ణు వర్ధన్, పి రాకేష్, శ్రీరామోజు హర్షిత, కౌట్ల శిరీష, మారిశెట్టి రవిచంద్ర, మహమ్మద్ తౌఫీక్, రేణి పల్లవి, కైఫ్ అలీలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం నుండి 9వ తరగతి నుండి నుండి ఇంటర్ వరకు సంవత్సరానికి 12000 చొప్పున మొత్తం 48000 ఉపకార వేతనం వస్తుందని తెలిపారు. మార్కుల పరంగా జిల్లాలో మొదటి 14 స్థానాలు మోడల్ స్కూల్ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. గత 5 సంవత్సరాలలో పాఠశాల నుండి 61మంది విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం ద్వారా ఈ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, రాకేష్, ప్రవీణ్, రమేష్, సైఫూల్లా, సంపత్, వరలక్ష్మి, స్వరూప, శోభ, సుజాత, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

సీనియర్ల భాగస్వామ్యంతో నూతన కమిటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసిఫాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎమ్మార్పీఎస్ కమిటీల నియామకంలో సీనియర్ నాయకులు భాగస్వాములు కావాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ రేగుంట కేశవరావు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వరకు సంస్థ బలోపేతం కోసం చేపట్టనున్న గ్రామ, వార్డు, మండల, డివిజన్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 15 మంది నుండి 30 మంది వరకు జిల్లా స్థాయి కమిటీలో సభ్యుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని సూచించారు. జులై 6న ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణలు చేపట్టాలని, జులై 7న వరంగల్‌లో జరిగే సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో తరలి వెళ్లేందుకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు నందకుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల పరీక్షలు

నవతెలంగాణ-రెబ్బెన



తేదీ-14-06-2024 శుక్రవారం రోజున బెల్లంపల్లి ఏరియా ఖైరిగుడ ఓసీ వద్ద బెల్లంపల్లి రీజియన్ (శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి) పరిధిలో ఈపీ ఆపరేటర్ పదోన్నతుల కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. సీ గ్రేడ్ నుండి బీ గ్రేడ్ పదోన్నతి కోసం 26 మంది ఈపీ ఆపరేటర్లు పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో ఎస్ఓటూ జీఎం ఎం నరేందర్, పిట్ ఇంజినీర్ వీరన్న, కార్పోరేట్ సభ్యునిగా (పర్సనల్ మేనేజర్ మందమర్రి ఏరియా) శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, వేణు, ఇంజినీర్లు మహేశ్వర్, కురేష పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 45 రోజుల పాటూ నిర్వహించనున్న ఉచిత బ్యూటీషియన్ శిక్షణను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సింహం సూచించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కళాశాలలో శుక్రవారం ఉచిత బ్యూటీషియన్ శిక్షణను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నైపుణ్య శిక్షణలో భాగంగా బ్యూటీషియన్ కోర్సు విద్యార్థులకు ఉపయోగపడుతుందని, శిక్షణతో విద్యార్థులకు లాభం చేకూరుతుందన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త బి శారధ మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతోపాటు భవిష్యత్తులో వారి కాళ్ళపై వారు నిలబడే దిశగా ఉపయోగపడుతుందన్నారు. మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రాణి, శిక్షణ నిపుణురాలు రవళి, కళాశాల అధ్యాపకురాలు ఈ శారధ, ఆర్ కృష్ణవేణి విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మందమర్రి

బస్టాండ్ ప్రాంతానికి చెందిన పేరాల శ్రీనివాస్ అనే యువకుడు టీ స్టాల్ పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్న క్రమంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిసి సిరిపురం మల్లయ్య, గజ్జెల్లి లక్ష్మణ్, నాగుల దుర్గయ్య, సమ్మిరెడ్డి, పవన్ ఫోటో స్టూడియో తిరుపతి, ఎండీ పాషా శుక్రవారం శ్రీనివాస్ నివాసానికి వెళ్లి తన కుటుంబ సభ్యులకు రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దాసరి అరుణ్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైయ్యాడు. నేషనల్ మేన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ అర్హత పరిక్ష 2023 ద్వారా భీమారం పాఠశాల నుండి ఎంపిక కావడం హర్షనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ. 12 వేల చొప్పున స్కాలర్ షిప్ అందుతుందని తెలిపిన ఆయన విద్యార్థికి సహకరించిన ఉపాధ్యాయులు తిరుపతి, రఘులను ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

ప్రమాద రహిత నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినియోగదారులకు ప్రమాద రహిత నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసుదేవ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్లలో నాణ్యమైన మోటర్లు స్విచ్లు బిగించకపోవడం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ పనులు నిర్వహించేటప్పుడు సిబ్బందితో పాటు సహకరించే వ్యక్తులు అవసరమైన భద్రత చర్యలు పాటించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో శాఖ సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి అవసరమని, నిరంతర శిక్షణ, భద్రత పద్ధతులను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి సత్యనారాయణ తెలిపారు. గత సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల పరీక్ష రాయగా పాఠశాలకు చెందిన విద్యార్థులు కర్నె క్రిష్ణతేజ, తాళ్లపల్లి కార్తీక్, సకినాల కార్తీక్, రాకిరె శరత్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఉపకార వేతనం కింద ఇంటర్మీడియట్ వరకు ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ.6 వేల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు చెప్పారు.

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌పై సర్వే

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మిషన్ భగీరథ ఇంటి ఇంటికి నల్లా కనెక్షన్ సర్వే వివరాలను మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. శుక్రవారం లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో ఇంటింటికి నల్ల కనెక్షన్ సర్వే వివరాలను, వాటి పనితీరును పరిశీలించారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నచో వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని, నీటిని పొదుపు పద్ధతిలో పాటించాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సిర్పూర్ పేపర్ మిల్లు స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్, కంప్యూటర్ కోర్సులను పూర్తి చేసుకున్నవారికి శుక్రవారం మిల్లు ప్రతినిధులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు రూరల్ డైరెక్టర్ సురేందర్ మౌర్య వైస్ ప్రెసిడెంట్ ఏకే మిశ్రా, జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 250 మందికి కుట్టు మిషను, కంప్యూటర్ నైపుణ్యం శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన స్త్రీలకు రూ.3 లక్షల శ్రీనిధి ఋణ సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ హాస్టల్, పాఠశాలల యూనిఫాం శిక్షణ పొందిన స్త్రీలకు ఇవ్వడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్లు ప్రతినిధులు గిరీష్ రాయ్, ఠాగూర్, రమేష్ రావు, నాగరాజు, రాణి బివాల్, తుమ్మ రమేష్, నాగేశ్వరరావు, శశి కాంత్ బొర్కాడే పాల్గొన్నారు.